క్లుప్తంగా

ఎఫ్‌డీపీని పక్కాగా అమలు చేయాలి



మద్దూర్ పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న జగదీష్ చంద్రారెడ్డి

పాణ్యం: ఎఫ్‌డీపీఫ్యామిలీ డాక్టర్ ప్రొగ్రామ్(ఎఫ్‌డీపీ)ను పక్కాగా అమలు చేయాలని నంద్యాల జిల్లా ఎఫ్‌డీపీ అధికారి జగదీష్ చంద్రారెడ్డి సూచించారు. బుధవారం ఎస్- కొత్తూ రు, మద్దూరు పీహెచ్‌సీలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామానికి కేటాయించిన తేదీల్లో సిబ్బంది వెళ్లి ప్రజలకు మందులు, బీపీ తదితర పరీక్షలు చేయించాలన్నారు. మంచానికే పరిమితమైన రోగులు, వృద్ధుల వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు చేయాలన్నారు. అనంతరం మద్దూర్ పీహెచ్‌సీలో ఓపీ విధానాన్ని పరిశీలించారు.అలాగే రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో డాక్టర్ అభిషేక్, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నపిల్లలతో పనిచేయిస్తే కఠిన చర్యలు



ఓ షాపు యజమానితో మాట్లాడుతున్న మురళీకృష్ణ

గడివేముల: హోటళ్లు, దుకాణాలు, మెకానిక్ షాపుల్లో చిన్న పిల్లలతో పనిచేయిస్తే కఠిన చర్యలు తప్పవని కార్మిక సహాయ అధికారి మురళీక్రిష్ణ హెచ్చరించారు. బాల కార్మిక నిర్మూలన కార్యక్రమంలో భాగంగా బుధవారం మండ కేంద్రం గడివేములలో ఆయన విస్తృతంగా పర్యటించారు. దుకాణాలను ఆయన తనిఖీ చేసిన ఆయన బాలలతో పనులు చేయించొద్దని సూచించారు. అదేవిధంగా బాలలతో పనులు చేయిస్తున్న యాజమానులకు నోటీసులు జారీ చేశారు. బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, పనులు చేయిస్తే కేసులు నమోదు చేస్తామని మురళీకృష్ణ హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికశాఖ సిబ్బంది సమీర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయశ్రీ

సి.బెళగల్: ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్ విజయశ్రీ ఉద్యోగులకు సూచించారు. బుధవారం తన కార్యాలయంలో మండల రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కుల, ఆదాయ ధృవపత్రాల దరఖాస్తులను విచారించాలన్నారు.అదేవిధంగా ఫ్యామిలీ మెంబర్, పొలం ఆన్‌లైన్ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించి సంతకాలు చేయాలని సూచించారు. సమావేశంలో డీటీ కృష్ణమూర్తి, మండల సర్వేయర్ నాగభూషణం, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.

శ్రీ మఠానికి మూడువేల మొక్కల విరాళం



మఠం పీఠాధిపతి సుభుదేంద్రతీర్థులతో పీ.వీ బద్రీనాథ్‌రావు

పాణ్యం: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి పాణ్యం గ్రామానికి చెందిన పీవీ బద్రీనాథ్‌రావు మూడువేల మొక్కలు విరాళంగా ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. పాణ్యంలోని తమ నర్సరీ నుంచి పూల, అలంకార, పండ్ల మొక్కలను అందజేశామన్నారు. వీటితో పాటు ల్యాండ్ స్కేపింగ్ మొక్కలు కూడా అందించామని చెప్పారు. మంత్రాలయానికి వచ్చే భక్తులు స్వామి వారి దర్శనమనంతరం నది ఒడ్డున ఏర్పాటు చేసిన మఠంలో, వివిధ ప్రాంతాల్లో ఈ మొక్కలు నాటినట్లు తెలిపారు. పాణ్యం నుంచి ప్రత్యేకంగా నిపుణులైన కూలీలతో మఠంలో అలంకార మొక్కలు నాటించినట్లు వెల్లడించారు.ఈ మొక్కల విలువ దాదాపుగా రూ. 8లక్షలు ఉంటుదన్నారు. అనంతరం పాణ్యం బద్రీనాథ్‌రావును మఠం పీఠాధిపతి సుభుదేంద్రతీర్థులు ఆశీర్వదించారు.

పాణ్యం సీఐగా కిరణ్‌కుమార్‌రెడ్డి

పాణ్యం: పాణ్యం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కిరణ్‌కుమార్‌రెడ్డిని ఉన్నతాధికారులు నియమించారు. కర్నూల్ రేంజ్ పరిధిలో 16మంది సీఐలను డీఐజీ బదిలీ చేశారు. కర్నూల్ వీఆర్‌లో ఉన్న కిరణ్‌కుమార్‌రెడ్డిని పాణాకి బదిలీ చేశారు. ప్రస్తుతం పాణ్యం ఇన్‌చార్జ్ సీఐగా వంశీధర్ ఉన్నారు.

పర్యవేక్షణ ఏదీ?

- నిర్లక్ష్యానికి కేంద్రంగా మారిన ఓర్వకల్లు పోలీస్ స్టేషన్
- ఉద్యోగులు ఫుల్... సేవలు నిల్‌గా మారిన వైనం
- పెట్రేగిపోతున్న అసాంఘిక కార్యకలాపాలు
- కేసు నమోదుకు బాధితులకు తప్పని ఇబ్బందులు
- రాజీ కుదుర్చి దండుకుంటున్నట్లు వెల్లువెత్తుతోన్న విమర్శలు



ఓర్వకల్లు పోలీసు స్టేషన్

ఓర్వకల్లు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గాడితప్పిన పోలీసుల విధులు నేటికీ గాడిన పడడం లేదు. దీంతో ప్రజలకు పోలీసుల సేవలు అందనంత దూరం అన్నట్లుగా మారింది. ప్రభుత్వం మారడంతో పోలీసుల తీరు మారిందనే విమర్శలు లేకపోలేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ప్రత్యేకించి ఓర్వకల్లు పోలీస్ స్టేషన్ అధికారుల తీరు నిర్లక్ష్యానికి కేంద్రంగా మారిందనే విమర్శలు ఉన్నాయి. ఇక్కడ విధులు నిర్వర్తించే ఉద్యోగుల సంఖ్యతో పోలిస్తే అధికారులు ఫుల్, సేవలు నిల్ అన్నట్లుగా ఉంది పరిస్థితి. స్టేషన్‌లో మొత్తం 28 మంది పోలీసులు విధులు నిర్వరిస్తున్నారు. ఎస్‌ఐతోపాటు ఏఎస్‌ఐలు ముగ్గురు, హెడ్ కానిస్టేబుళ్లు ఏడుగురు, కానిస్టేబుళ్లు 17 మంది ఉన్నారు. ముగ్గురు హోంగార్డులు కూడా. ఇందులో 8 మంది బయటి డ్యూటీలకే పరిమితం కాగా, మిగతా 20 మంది ఉద్యోగులు ఇక్కడ విధులు నిర్వర్తించాల్సి ఉంది. అయితే కేవలం 12 మంది మాత్రమే విధులకు హాజరువుతున్నట్లు సమాచారం. ఇంకా ఎనిమిది మంది ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారో ఎవ్వరికీ అర్థమవ్వని ప్రశ్న. ఈ స్టేషన్‌లో ఒక్కోసారి పరిస్థితి ఎలా ఉంటుందంటే కనీసం ఎస్‌ఐ ఉన్నారా అని అడిగితే కూడా సరైన సమాధానం ఉండని పరిస్థితి. స్థానికంగా ఉండరు... సమాధానమూ ఉండదు అనేలా తయారైందని సామాన్యుడితోపాటు ప్రజా, కుల సంఘాల నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు.

కేసు నమోదు... ఇక్కడ కుదరని పరిస్థితి !

ఓర్వకల్లు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయాలంటే కుదరని పరిస్థితి అనే అపవాదు మూటగట్టుకున్నారు ఇక్కడి పోలీసులు. ఎవరైనా బాధితులు న్యాయం కోసం వస్తే పోలీసులు గొడవలు వద్దు... సర్దుకపోండి అని చెప్పడం సహజం. అప్పటికీ బాధితుడు ఒప్పుకోకపోతే అతని ఫిర్యాదు మేరకు న్యాయం చేయడం పోలీసుల ధర్మం. అయితే ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు ఓర్వకల్లు పోలీసులు. మండల పరిధిలోని ఓ గ్రామానికి (పుట్టిళ్లు) చెందిన వివాహిత విషయంలో పోలీసులు వ్యవహరించిన తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమ సంసారంలో గొడవలకు కారణం ఇది.. అని భర్త ఫిర్యాదు చేయగా పోలీసులు చేతివాటం చూపారు. ఫిర్యాదును అడ్డుపెట్టుకుని అం దినంతా లాక్కున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా నన్నూరు గ్రామానికి చెందిన ఇద్దరు అన్నదమ్ముల మధ్య జరిగిన ఘర్షణ విషయంలో ఇదే జరిగింది. ఇద్దరిని స్టేషన్‌కు పిలిపించి అన్నదమ్ములను రాజీ చేసిన పోలీసులు ఇరువురి నుంచి మామూళ్లు వసూళ్లు చేసినట్లు తెలిసింది. ఇలాంటివి చాలానే ఉన్నాయి. రాగమయూరి కేంద్రంగా రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. ఈ బియ్యం వ్యాపారికి పోలీసులతో సన్నిహిత సంబంధాలు ఉన్నందునే అక్రమ వ్యాపారం జోరుగా సాగుతుందనే ఆరోపణలు లేకపోలేదు. ఉశేనాపురం, మీదివేముల, నన్నూరు గ్రామాల్లో జరిగిన రాజకీయ దాడులకు సంబంధించి కూడా పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించారనే విమర్శలు ఉన్నాయి.

నేడు బాధ్యతలు స్వీకరించనున్న ఎస్‌ఐ సునీల్ కుమార్



కర్నూలు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా మూడురోజుల క్రితం చంద్రబాబు బాధ్యతలు తీసుకున్న విషయం తెలిసిందే. గురువారం ఎస్‌ఐగా సునీల్ కుమార్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈయన వెల్దుర్తి నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు. ఎస్‌ఐకి సవాళ్లు ఎదురుగా ఉన్నాయనేది వాస్తవం. మండలంలో అసాంఘిక కార్యకలాపాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. పేకాట, అక్రమ సారా, ఎర్రమట్టి అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. లొద్దిపల్లె, నన్నూరు, పూడిచెర్ల, కొమ్ముచెరువు ప్రాంతాలలో అక్రమ మట్టి తవ్వకాలు అరికట్టడంలో పోలీసులు విఫలమయ్యారు. ఇప్పటికైనా కట్టడి అయ్యేనా అని ఆశపడుతున్నారు మండల ప్రజలు.

దొంగతనాలు పెరుగుతున్నా స్పందన లేదు...



మండలంలో రోజు రోజుకు దొంగతనాలు పెరిగిపోతున్నా పోలీసుల నుంచి కనీస స్పందన లేదు. విచ్చలవిడిగా జూదం సాగుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. జాతీయ రహదారిపై పూడిచెర్ల బస్సు స్టేజీ వారం రోజుల్లో రెండు బైక్‌లను దుండగులు ఎత్తుకెళ్లారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినా నేటికీ కనీస సమాచారం లేదు. – నాగన్న, సీపీఎం మండల కార్యదర్శి

శాంతిభద్రతలకు భంగం వాటిల్లుతుంది....



పోలీసుల నిర్లక్ష్యం మూలంగా మండలంలో శాంతిభద్రతలకు భంగం వాటిల్లుతుంది. మందుబాబులు అప్పుడప్పుడు వీరంగం సృష్టిస్తున్నా అడిగే నాథుడు కరువయ్యారు. ప్రత్యేకించి మహిళలు మందుబాబుల మూలంగా ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. బాధిత మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఏ మాత్రం చర్యలు కనిపించడం లేదు. – రమేష్, సీపీఐ మండల కార్యదర్శి

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు



లొద్దిపల్లె, నన్నూరు, పూడిచెర్ల, కొమ్ముచెరువు ప్రాంతాలలో యథేచ్ఛగా అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాయి. సారా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. సెబ్ అధికారుల ఒత్తిడి మేరకు స్థానిక పోలీసులు తూతూమంత్రంగా దాడులు చేస్తున్నారే తప్పా కట్టడి చేయాలనే ధోరణి ఏ మాత్రం కనిపించడం లేదు. ఉన్నతాధికారులు స్పందిస్తే తప్పా బాధితులకు న్యాయం జరిగే పరిస్థితి లేదు. – రవీంద్రనాథ్, ఆర్‌పీఎఫ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలి

కల్లూరు: ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామీణ అంశాలపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు చివరి రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు.

మండల పరిషత్ కార్యాలయ భవనంలో ఉపాధి హామీ పథకంపై ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. పండ్ల తోటల పెంపకం, సీడ్ డిబ్లింగ్ ప్లాంటేషన్ పనులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈఆర్డీ రవికిషోర్, ఏపీఓ మద్దేశ్వరమ్మ, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ల అనుకూల చట్టాలను రద్దు చేయాలి

కల్లూరు: రైతులు, రైతుల కూలీలు, చిరు వ్యాపారులను చిన్నాభిన్నం చేస్తూ కార్పొరేట్లకు అనుకూలంగా ఉన్న కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు, అధ్యక్షులు రాధాకృష్ణ, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ నిర్మల డిమాండ్ చేశారు. బుధవారం కల్లూరులోని ఇందిరమ్మ కట్ట దగ్గర సీఐటీయూ న్యూ సీటి అధ్యక్షులు నరసింహులు అధ్యక్షత జన జాగరణ కార్యక్రమం నిర్వహించారు. ప్రజానాట్యమండలి కళాకారులు, ప్రతిభ పాఠశాల విద్యార్థులు, కల్లూరు యువత దేశభక్తి గీతాలకు నృత్యాలు చేసి ప్రజలను ఉత్తేజపరిచారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సుధాకరప్ప, గోవిందు, గోపాల్, రమణమూర్తి, యేసు, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం పూజలు



వర్షం కోసం పూజలు చేస్తున్న గడివేముల కుర్వలు

గడివేముల:వర్షం కురువాలని కోరుతూ బుధవారం మండల కేంద్రం గడివేములలో కురువ సామాజిక వర్గం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కుల దైవమైన బీరప్ప స్వామి దేవాలయం నుంచి లింగమయ్య స్వామి అరుగు వరకు డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లారు. లింగమయ్యస్వామికి జలాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు కురవని సమయంలో లింగమయ్య స్వామికి పూజలు చేయడం ఆనవాయితీ వస్తుందని వారు తెలిపారు.

బుగ్గరామేశ్వరునికి జిల్లా జడ్జి పూజలు



బుగ్గరామేశ్వరస్వామి సన్నిధిలో జడ్జిని సత్కరిస్తున్న పూజారులు

ఓర్వకల్లు: మండల పరిధిలోని కాల్వబుగ్గలో వెసిన బుగ్గరామేశ్వరునికి లోక్ అదాలత్ కోర్టు న్యాయమూర్తి లీల వెంకటశేషాద్రి పూజలు నిర్వహించారు. బుధవారం ఆయన మండలంలోని పలు ప్రాంతాలలో పర్యటించారు. ముందుగా స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని సందర్శించారు. వసతులు, విద్యాబోధనపై విద్యార్థులతో మాట్లాడి ఆరాతీశారు. అనంతరం బుగ్గరామేశ్వరస్వామి, కొమ్ముచెరువు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం ఆలయ పూజారులు జడ్జిని ఆలయ మర్యాదలతో సత్కరించారు. తదనంతరం కాల్వ వద్ద ఉన్న పుట్టగొడుగుల పరిశ్రమను పరిశీలించారు. పుట్టగొడుగుల తయారీని పరిశ్రమ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు, వేతన సదుపాయాలపై ఆరాతీశారు.

నగరాన్ని అభివృద్ధి చేస్తాం

- మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ రామయ్య, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు: నగరంలోని 52 వార్డులను అభివృద్ధి చేస్తామని మేయర్ బీవై రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి తెలిపారు. బుధవారం కల్లూరు అర్బన్ పరిధి 29వ వార్డులోని ఇండస్ స్కూల్ సమీపంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి భూమి పూజ చేశారు. శిలాఫలకం ఆవిష్కరించి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ రామయ్య మాట్లాడుతూ కర్నూలు నగరంతో పాటు, కల్లూరు అర్బన్ పరిధిలోని వార్డులో కూడా ప్రాధాన్యత మేరకు పనులు చేపడుతామన్నారు. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాల పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, స్థానిక కార్పొరేటర్ సంగాల సుదర్శన్‌రెడ్డి, ఎంఈ షాకీర్, డీఈ నరేష్, ఏఈ భాను తదితరులు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం



మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకులు వెంకటరత్నం

సి.బెళగల్: పల్లెల అభివృద్ధిలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమని, అంకిత భావంతో విధులు నిర్వరిస్తే ప్రజలకు మెలు జరగుతుందని గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల (జీపీడీపీ) శిక్షణ రాష్ట్ర పరిశీలకులు వెంకటరత్నం పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈజీపీడీపీపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం డీపీఎం గిడ్డేష్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌లు, కార్యదర్శులు విధులను బాధ్యతగా నిర్వర్తిస్తే గ్రామాల్లో ఏ సమస్యలు ఉండవన్నారు. ఆ దిశగా గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఎంపీపీ బొంతల మునెప్ప మాట్లాడుతూ సర్పంచ్‌లు పంచాయతీరాజ్ చట్ట పరిధిలోని పనులను తప్పనిసరిగా చేపట్టాలన్నారు. ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి పరిష్కార చర్యలు తీసుకోవాలని కోరారు. ఈఓఆర్డీ సందీప్, ఏఈ సుకుమార్ పంచాయతీల ఆదాయ వనరులు, వీధి బల్బుల నిర్వహణ, పంచాయతీల విద్యుత్ బిల్లుల చెల్లింపు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న సభ్యులకు అధికారులు ధృవపత్రాలు అందజేశారు.

రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయండి



అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు: రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం తన కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రామలింగేశ్వర్‌రావు, ఆర్అండ్‌బీ డీఈ రాధిక తదితర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నంద్యాల, నందికొట్కూరు రోడ్లలో చేయాల్సిన విస్తరణ పనులు వివరాలను ఎమ్మెల్యే అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా రహదారుల్లో విస్తరణ పనులు ట్రాఫిక్ సమస్యలు లేకుండా సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి



కోడుమూరులో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు



గూడూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు

కోడుమూరు రూరల్: ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని కోడుమూరు ఎంపీడీఓ చంద్రశేఖర్ ప్రజలకు పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల అధికారులు విద్యార్థులతో కలిసి జాతీయజెండాలు చేతబూని పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడూతూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ప్రజలంతా దేశ సమగ్రతను కాపాడేలా పండుగలా జరుపుకోవాలన్నారు. 15న ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయం ఎదుట జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని ఎంపీడీఓ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓలు శరభయ్య, వసంతలక్ష్మి, ఏపీఓ మోదీన్‌బాషా, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

గూడూరులో...

మండల కేంద్రం గూడూరులో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని బుధవారం మున్సిపల్ అధికారులు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ జులపాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అధికారులు జాతీయ జెండాలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండా పండుగ గొప్పతనాన్ని వివరిస్తూ ప్రతి ఇంటిపై జెండాను ఎగురవేయాలని చైర్మన్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారి రవికుమార్, ఏఈ నరసింహులు, మెప్మా సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రం ఓర్వకల్లులో విద్యార్థులు నిర్వహించారు. ఎంపీడీఓ శివనాగప్రసాద్, ఎంఈఓ ఓంకార్ యాదవ్ ఆధ్వర్యంలో జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. అన్ని గ్రామ పంచాయతీలు, సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద గురువారం జాతీయ జెండాలు ఎగురవేయాలని ఎంపీడీఓ, ఎంఈఓ పిలుపునిచ్చారు.

కల్లూరు: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం కల్లూరు అర్బన్ పరిధిలోని శరీన్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఠాగూర్ పాఠశాలల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యార్థులు జాతీయ జెండాలు చేతబూని ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రవికిషోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



గడివేములలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

గడివేముల: స్వాతంత్ర్యం దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు ద్వారం శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రం గడివేములలో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం 'హర్ ఘర్ తిరంగ' ర్యాలీ నిర్వహించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బస్టాండ్ వరకు జాతీయ జెండాలు పట్టుకుని ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో హై స్కూల్ హెచ్‌ఎం విక్టర్ ఇమ్మానియేల్, బీజేపీ ఓబీసీ మోర్చా మండల నాయకులు మంజుల వెంకటరమణ, టీడీపీ మండల కన్వీనర్ సత్యనారాయణ రెడ్డి, జనసేన మండల నాయకులు కురువ శివ సాయిరాం, మాజీ సర్పంచ్ జమాల్‌బాషా, కొర్రపోలూరు సర్పంచ్ మాలిక్ భాషా, ఎక్స్ ఆర్మీ జమాల్ బాషా తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయాలు ముస్తాబు



తహసీల్దార్ కార్యాలయంలో గాంధీకట్టకు సున్నం వేస్తున్న కార్యాలయ సిబ్బంది

సి.బెళగల్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించేందుకు కార్యాలయాలు, పాఠశాలలు ముస్తాబు అవుతున్నాయి. స్వాతంత్ర్య సమరయోధుల ఫొటోలు, విగ్రహాలను శుభ్రం చేస్తున్నారు. ఆయా కార్యాలయాలను సిబ్బంది, స్కూళ్లను విద్యార్థులు సైతం శుభ్రం చేశారు. పాఠశాల మహిళా ఉపాధ్యాయినీలు రంగు రంగుల ముగ్గులను వేశారు. తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్ శాలుమియ్య వీఆర్ఏలతో కలిసి గాంధీకట్టకు సున్నం వేశారు. ఉద్యోగులు ఆయా కార్యాలయాల్లో రంగుల తోరణాలను ఏర్పాటు చేశారు.

ఆటో బోల్తా... నలుగురికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె జాతీయ రహదారిపై రాజస్థాన్ దాబా వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. హైవే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శిరివెళ్ల మండలం మహదేవాపురం గ్రామానికి చెందిన ఆరుగురు స్వగ్రామం నుంచి గద్వాల్‌లో సీడ్‌పత్తి క్రాసింగ్ పనులకు బయలుదేరారు. తమ్మరాజుపల్లెకు చేరుకోగానే ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో పాండు, శ్రీనివాసులకు తీవ్ర గాయాలు గాయాలవ్వగా ఏసేపు, డేవిడ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం నంద్యాల జీజీహెచ్‌సీ తరలించారు.

ఆధారాల కోసం ఎస్సార్‌బీసీలో గాలింపు

పాణ్యం: ఈనెల 12న స్థానిక ఎస్సార్బీసీ కాల్వ వద్ద వెలుగు చూసిన యువకుడి హత్యకు సంబంధించిన కేసులో ఆధారాల కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. యువకుడిని తుపికీతో కాల్చి, తుపాకీని ఎస్సార్బీసీ కాల్వలో పడేశారనే అనుమానంతో పోలీసులు బుధవారం గజ ఈతగాళ్లతో ఎస్సార్బీసీ కాల్వలో గాలించారు. 1,400 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా ఫ్లోను తగ్గించి మరీ గాలించినా ఎలాంటి ఆనవాళ్లు లభ్యంకాలేదని తెలుస్తోంది. కాగా పోలీసుల అదుపులో ఉన్న అనుమానితులు నేరం ఒప్పుకున్నట్లు సమాచారం. నిందితులందరికీ మహరాష్ట్ర కాగా.. గుంతకల్లులో నివసిస్తూ చోరీలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలినట్లు సమాచారం.





